సాక్షి ఖమ్మం

మంగళవారం । 25 । జూలై । 2023



జీవన ఎరువు.. కరువు!

తెగుళ్లను సమర్థంగా నిర్మూలిస్తుందనే పేరున్న జీవన ఎరువు జిల్లాలో సరిపడా ఉత్పత్తి లేకపోవడంతో కొరత ఏర్పడింది. 10లో



దళితులు ఎదగొద్దా?

ప్రజలకు సేవ చేస్తున్న తనను దొరగా మాజీ ఎంపీ పొంగులేటి పేర్కొనడం సరికాదని ఎమ్మెల్యే వెంకటవీరయ్య మండిపడ్డారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 25°

వాతావరణం

మంగళవారం జిల్లా అంతటా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదవుతుంది.

సాగర్ కరుణిస్తేనే సాగు

ఎన్నెస్పీ నుంచి నీటి విడుదల ప్రశ్నార్థకమే..

- నీళ్లు లేక అడుగంటిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు
- జిల్లాలో 2.79 లక్షల ఎకరాల ఆయకట్టు
- మెట్టపంటల వైపు చివరి ఆయకట్టు రైతుల చూపు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మొన్నటి వరకు వర్షాభావంతో వ్యవసాయ సీజన్ ఆలస్యం కాగా.. మరోవైపు జిల్లాకు ప్రధాన నీటి వనరైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. దీంతో సాగర్ రెండో జోన్ పరిధి జిల్లాలోని 17 మండలాల్లో ఉన్న 2,79,496 ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా ఇప్పటికే సాగర్ జలాల విడుదలపై ప్రభుత్వం ప్రకటన విడుదల చేసేది. ఆగస్టు మొదటి లేదా రెండో వారంలో జిల్లాలోకి జలాలు ప్రవేశించేవి. కానీ ఈసారి కృష్ణా నది పరివాహకంలో వర్షాలు లేక ప్రాజెక్టు బోసిపోతుండడంతో నీటి విడుదలపై నీలినీడలు కమ్ముకోగా.. ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది. దీంతో పలువురు మెట్ట పంటల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. కానీ ఎగువన వర్షాలు కురిస్తే ప్రాజెక్టులోకి నీళ్లు చేరి.. ఆలస్యంగానైనా విడుదల చేస్తారనే ఆశ మరికొందరిలో వ్యక్తమవుతోంది. ఇప్పటికే బోర్లు, బావులు ఉన్న రైతులు వరి నార్లు పోయగా, ఏ ఆధారం లేని రైతులు మాత్రం సాగర్ ఎప్పుడు నిండుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆ నీళ్లొస్తేనే జలకళ..

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో జలాశయాలు వట్టిపోయాయి. గత ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పుడిప్పుడే వరద చేరుతోంది. జిల్లాలోని పాలేరు, వైరా రిజర్వాయర్లు, లంకాసాగర్ తదితర ప్రాజెక్టుల్లోకి ఇంకా నీరు సమృద్ధిగా చేరలేదు. ఆయకట్టు పరిధిలో ఉన్న 983 చెరువులకు గాను 597 చెరువుల్లో 50 శాతం కూడా నీళ్లు లేవు. దీంతో వీటి కింద సాగు పూర్తిగా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం బోర్లు, బావుల కింద కొద్దోగొప్పో సేద్యం చేస్తున్నారు. కానీ సాగర్ నీళ్లు విడుదలైతేనే ఆయకట్టు పరిధిలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులు జలకళ సంతరించుకుని సాగు జోరందుకుంటుంది.

ఎప్పుడు.. ఎలా?

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల ప్రశ్నార్థకంగానే ఉంది. నీరు విడుదల కాని పక్షంలో సాగర్ ఎడమకాల్వ రెండో జోన్ పరిధిలో జిల్లాలో ఉన్న 2,79,496 ఎకరాల ఆయకట్టు సాగు సమస్యగా మారుతుంది. ఆయకట్టులో కాల్వల ద్వారా సాగయ్యేది 2,54,270 ఎకరాలు కాగా ఎత్తిపోతల పథకాల ద్వారా 25,226 ఎకరాల భూమి ఉంది. ఏటా వానాకాలంలో ఇప్పటికే నీటి విడుదల షెడ్యూల్ వెల్లడిస్తే రైతులు సాగుకు సన్నద్ధమయ్యేవారు. కానీ ఇప్పుడు నీరు లేక ప్రకటన రాక... సాగర్ నీళ్లు వస్తాయో, రావో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి ఆయకట్టులోని కొందరు రైతులు మొక్కజొన్న, పెసర, కంది వంటి మెట్ట పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

మధిరలో 28,867 ఎకరాలు

జిల్లాలోని 17 మండలాల్లో నాగార్జునసాగర్ ఆయకట్టు ఉంది. ఇందులో అత్యధికంగా మధిర మండలంలో 28,867 ఎకరాలు సాగవుతున్నాయి. ఆతర్వాత నేలకొండపల్లి మండలంలో 28,498, చింతకానిలో 27,778, కల్లూరులో 26,762, తల్లాడలో 26,134 , ముదిగొండలో 24,877, బోనకల్ మండలంలో 24,057 ఎకరాల భూమి ఉంది.



నీళ్లు లేక రాళ్లు తేలిన జిల్లాలోని నాగార్జున సాగర్ ఎడమకాల్వ

నాగార్జునసాగర్ సామర్థ్యం, ఆయకట్టు వివరాలు

ప్రాజెక్టు సామర్థ్యం	590 అడుగులు
ప్రస్తుతం ఉన్న నీరు	516.5 అడుగులు
జిల్లాలో ఆయకట్టు	2,54,270ఎకరాలు
ప్రధాన రిజర్వాయర్లు	పాలేరు, వైరా
గత ఏడాది నీటి విడుదల	ఆగస్టు 3

జిల్లాలో సాగర్ పరిధిలోని రిజర్వాయర్లు, నీటి వివరాలు (అడుగుల్లో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం
పాలేరు	23	20
వైరా	18.3	15.10
లంకాసాగర్	16	11.01
జాలిముడి	15	15.04

రాకపోతే వదిలేయడమే...



ఈ రైతు పేరు దాసరి నాగేంద్రబాబు. కూసుమంచి మండలం మల్లాయిగూడెంకు చెందిన ఆయనకు కాల్వ కింద మూడెకరాల మాగాణి ఉంది. కాల్వలో ఉన్న కాస్త నీటిని మోటార్ల ద్వారా లాగి నారు పోశాడు. ఆతర్వాత పైనుంచి నీరు రాకపోవడంతో దుక్కులు దున్ని ఎదురుచూస్తున్నాడు. నీళ్లు వస్తే సరి.. లేదంటూ భూమిని బీడుగా వదిలేయడమేనని చెబుతున్నాడు.

కళ తప్పిన ప్రాజెక్టు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 590 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 516.5 అడుగుల మేర నీరు ఉంది. ఇప్పటికీ నీరు విడుదల చేయకపోవడంతో జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌లో మునుపెన్నడూ లేని విధంగా నిల్వలు పడిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైనుంచి పాలేరు రిజర్వాయర్‌లోకి వరద నీరు వస్తుండటం కాస్త ఉపశమనం కలిగించే అంశం. పాలేరు రిజర్వాయర్ సామర్థ్యం 23 అడుగులు కాగా ప్రస్తుతం 20 అడుగుల మేరకు నీరు ఉంది. కానీ నీటిని తాగు అవసరాలకే వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

సాగర్ నీళ్లే దిక్కు ..



బోనకల్ బ్రాంచ్ కెనాల్ కింద నాలుగు ఎకరాల మెట్ట, రెండున్నర ఎకరాల మాగాణి ఉంది. మా పొలానికి బావి, బోరు, కరెంట్ సౌకర్యం లేదు. సాగర్ నీరు వస్తేనే వరి ఇతర పంటలు పండిస్తాం. ఒకవేళ సాగర్ నీళ్లు రాకపోతే సాగు ఆశలు వదులుకోవడమే.

– బొడ్డుపల్లి నాగచంద్రుడు, ముష్టికుంట్ల, బోనకల్

న్యూస్‌రీల్

జిల్లాను ఫైలేరియా రహితంగా తీర్చిదిద్దుదాం.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాను ఫైలేరియా రహితంగా మార్చేందుకు అందరూ కృషిచేయాలని డీఎంహెచ్‌ఓ బి.మాలతి సూచించారు. ఖమ్మంలోని టీటీడీసీలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి సోమవారం ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. బోదకాలు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరితో మాత్రలు మింగించాలని తెలిపారు. అనంతరం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫైలేరియా సోకే మార్గాలు, నిర్మూలనపై అవగాహన కల్పించారు. అలాగే, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, అడిషనల్ డెరైక్టర్ నాగయ్య మాట్లాడుతూ రెండేళ్లు పైబడిన వారందరితో మాత్రలు మింగించి వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సైదులు, డాక్టర్ ప్రమీల, డాక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వరరావు, డెమో సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా శివరామయ్య

ఖమ్మంక్రైం: ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా శివరామయ్యను నియమితులయ్యారు. అలాగే, ఖమ్మం సీటీసీకి ఫణీందర్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వీరిద్దరు పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉండగా జిల్లాకు వస్తున్నారు.

సామర్థ్యాలను పెంపొందించాలి

ఖమ్మం సహకారనగర్: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రణాళికా ప్రకారం బోధన సాగిస్తూ సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖమ్మం రిక్కాబజార్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించాల్సిన విధానంపై హ్యాండ్‌బుక్‌లు, పిల్లల అభ్యాసం కోసం వర్క్‌షీట్లతో కూడా వర్క్‌బుక్‌లు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు మండలస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏఎంఓ రవికుమార్, కోర్సు కోఆర్డినేటర్, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం కనపర్తి వెంకటేశ్వర్లుతో పాటు వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌కుమార్, జీవన్, అనిల్‌కుమార్, సైదా, శ్రావణ్‌కుమార్, రెహానా బేగం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంకన్న



ఆర్‌ఎంకు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా సీహెచ్.వెంకన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం కార్యాలయ ఉద్యోగులు, అధికారులు బి.ప్రసాద్, అంజయ్య, రామ్మోహనరావు, బాలస్వామి, దేవదానం, వీరన్న, శ్రీనివాసరావు తదితరులు ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఆతర్వాత ఆర్‌ఎం వెంకన్న కొత్త బస్టాండ్‌ను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు.

ఏఎన్‌ఎంల నియామకానికి ఇంటర్వ్యూలు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏఎన్‌ఎంలను నియమించనున్నారు. ఈమేరకు దరఖాస్తు చేసుకున్న 40 మంది అభ్యర్థులను సర్టిఫికెట్లను ఖమ్మంలోని గిరిజన భవన్‌లో జిల్లా స్థాయి ఎంపిక కమిటీ పరిశీలించింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమం, ఉపాధి కల్పన, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా నటరాజ్

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఎస్.నటరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్.మధుసూదన్ హైదరాబాద్‌కు బదిలీ కాగా, ఆస్థానంలో మంచిర్యాల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌ను నియమించారు. కానీ ఆయన ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు. దీంతో ఆదిలాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉన్న నటరాజ్‌ను ఖమ్మంకు కేటాయించారు.

ఖమ్మం టూటౌన్ సీఐ బదిలీ!

ఖమ్మంక్రైం: బాధ్యతలు స్వీకరించి పట్టుమని పది రోజులు కాకముందే ఖమ్మం టూటౌన్ సీఐ బదిలీ అయ్యారు. పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేయగా, ఇందులో ఇటీవలే విధుల్లో చేరిన ఖమ్మం టూటౌన్ సీఐ ఎస్.రవికుమార్ కూడా ఉన్నారు. ఆయన బదిలీ వెనుక రాజకీయ వర్గాలు ఉన్నాయని తెలుస్తుండగా, ఒత్తిడి తట్టుకోలేక ఆయనే బదిలీ చేయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో గతంలో విధులు నిర్వర్తించి వెళ్లిన సీఐలు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా రాజు

ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా వీఆర్‌లో ఉన్న బి.రాజును నియమించగా, ఖమ్మం సీసీఎస్ సీఐ–2గా ఉన్న కె.శ్రీధర్‌ను ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. కొద్దిరోజుల క్రితం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సతీష్, ట్రాఫిక్ సీఐ అంజలి బదిలీ అయిన విషయం విదితమే.

ఉపాధ్యాయుడిగా ఐపీఎస్ అధికారి!



పాఠం బోధిస్తున్న ట్రైయినీ ఐపీఎస్ అవినాష్

మధిర: మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ట్రెయినీ ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్ సందర్శించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం డాక్టర్ ప్రభుదయాళ్ సమకూర్చిన వస్త్రాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆయన కాసేపు ఉపాధ్యాయుడిలా మారి పదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. ప్రణాళికాయుతంగా చదువుతూ 10 జీపీఏ సాధించాలని సూచించారు.

వీఆర్‌ఏలు... ఇక ప్రభుత్వ ఉద్యోగులే

- క్రమబద్ధీకరణ, పే స్కేల్ అమలుపై ప్రభుత్వం ఉత్తర్వులు
- త్వరలోనే వివిధ శాఖలకు కేటాయింపు
- జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 618మంది

ఖమ్మం సహకారనగర్: ఇప్పటి వరకు అరకొరగా వస్తున్న గౌరవ వేతనంతో కాలం వెళ్లదీస్తున్న వీఆర్‌ఏలు ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. రెగ్యులర్ చేసి పేస్కేల్ వర్తింపజేయాలనే డిమాండ్‌తో వారు చేస్తున్న పోరాటం ఇప్పుడు ఫలించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో విలీనం చేస్తున్నట్లుగా ప్రకటించడంతో పాటుఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 21 మండలాల్లో 379 రెవెన్యూ గ్రామాలకు గాను 759మంది వీఆర్‌ఏలు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 618మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో డైరెక్ట్ రిక్రూటీలు 189మంది, మిగతా 429 మంది వారసత్వంగా కొనసాగుతున్నారు. వీరి సర్వీస్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు పే స్కేల్ వర్తింపచేయనున్నట్లు ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వ నిర్ణయం వెలువడగానే తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ట్రెసా), టీఎన్జీవోస్ బాధ్యులను వీఆర్‌ఏల సంఘం నాయకులు కలిసి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పాలనలో పట్టుగొమ్మలు

వీఆర్వో వ్యవస్థ రద్దయ్యాక గ్రామస్థాయిలో రెవెన్యూపరంగా వీఆర్‌ఏలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కింది స్థాయి మొదలు అధికారుల వరకు అన్ని విషయాల్లో చేదోడుగా నిలుస్తున్న వీరు పట్టుగొమ్మలుగా ఉన్నారు. అయితే, ఇన్నాళ్లు వీరికి ఉద్యోగ భద్రత లేకపోగా.. ఇప్పుడు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

ఆందోళనలకు దక్కిన ఫలితం

వీఆర్‌ఏలు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏళ్లుగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. 2016, 2022వ సంవత్సరాల్లో సుమారు నెల పాటు సమ్మె కూడా చేశారు. ప్రధానంగా రెగ్యులర్ చేయడంతో పాటు పే స్కేల్ ఇవ్వాలని, అర్హత కలిగిన వారందరికీ పదోన్నతులు ఇవ్వాలనేది వీరి డిమాండ్‌గా ఉంది. ఎట్టకేలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూల నిర్ణయం ప్రకటించి జీఓ విడుదల చేయడం విశేషం.

కీలక శాఖల్లోకే...

ఇదిలా ఉండగా రెగ్యులర్ అయ్యే వీఆర్‌ఏలను వివిధ శాఖలకు కేటాయించనున్నారు. ప్రధానంగా జల వనరులు, మిషన్ భగీరథ, వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్యం, గురుకులం, ఉన్నత విద్యాశాఖ, పాఠశాల విద్యాశాఖ, మున్సిపాలిటీ శాఖల్లో వీరి అర్హత ఆధారంగా పోస్టింగ్ ఇస్తారు. త్వరలోనే జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యాన ఈ ప్రక్రియ జరగనుంది. కాగా, జిల్లాలో 759 మంది వీఆర్‌ఏలకు గాను 618మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో పీజీ అర్హత కలిగిన వారు 80 మంది, డిగ్రీ పూర్తిచేసిన వారు 162మంది, ఇంటర్ పూర్తిచేసిన వారు 207 మంది ఉండగా, పదో తరగతి అర్హత ఉన్న వారు 47మంది ఉన్నారు. కాగా, వీరి సర్వీస్ క్రమబద్ధీకరణ, పోస్టింగ్‌పై త్వరలోనే విధివిధానాలు వెల్లడి కానున్నాయి.

భద్రత పెరిగింది...



ప్రభుత్వ నిర్ణయంతో మాకు భద్రత పెరిగినట్లయింది. ఇన్నాళ్ల కష్టమంతా మరిచిపోయాం. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. మమ్మల్ని రెగ్యులర్ చేస్తూ పేస్కేల్ ఇవ్వనుండటం ఆనందంగా ఉంది.

– చల్లా లింగరాజు, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

మా ఆశలు నెరవేరాయి..



సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారు. ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు అరకొర వేతనాలతో ఇబ్బందులు పడిన మేము ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చాన్నాళ్లుగా మేం ఆశిస్తున్న కల నెరవేరింది.

– ఉప్పు రమాదేవి, వీఆర్‌ఏ, ఖమ్మం రూరల్

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

ఖమ్మంసహకారనగర్: ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం పలువురికి ఆయన గుర్తింపు కార్డులు అందజేసి మాట్లాడారు. జిల్లాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డుల కోసం 49 దరఖాస్తులు రాగా, క్షేత్ర స్థాయి తనిఖీలు చేపట్టి 20 మందికి జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

గ్రీవెన్స్‌లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మంసహకారనగర్: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'గ్రీవెన్స్ డే'లో ఆయన పలువురి నుంచి వినతిపత్రాలు, దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై పరిష్కారంపై సూచనలు చేశారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన కె.నాగేశ్వరరావు ఆసరా పింఛను పునరుద్ధరించాలని కోరారు. అలాగే, ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురానికకి చెందిన పుప్పాల పద్మ తన కుటుంబీల పేర్లు రేషన్ కార్డులో నమోదు చేయించాలని, ఖమ్మం రూరల్ మండలం కొండాపురానికి చెందిన బుర్ర భద్రఖాళి భూమి ధరణి రికార్డుల్లో వచ్చేలా చూడాలని, కామేపల్లి మండలం ఊట్కూరుకు చెందిన ఎస్.కే.ఖాసీం ఇంకుడుగుంత బిల్లు ఇప్పించాలని కోరగా, కారేపల్లి మండలం గాదెపాడుకు చెందిన షేక్ మహబూబ్ సాహెబ్ తన భూమి సర్వే చేయించాలని విన్నవించారు.

పకడ్బందీగా శిక్షణ, అవగాహన

ఈవీఎంల వినియోగంపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి ఆయన రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లతో ఈ అంశంపై వీసీ ద్వారా సమీక్షించి సూచనలు చేశారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎంలపై కల్పిస్తున్న అవగాహన విషయంలో జాగ్రత్తలు వహించాలని, వాహనాలు, యంత్రాల రవాణా సమయంలో ఎస్కార్ట్ కల్పించాలని సూచించారు. అలాగే, కొత్త ఓటర్ల నమోదు, సవరణల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అభిలాష్ అభినవ్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో శిరీష, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, విద్యుత్ ఎస్ఈ ఏ.సురేందర్, కలెక్టరేట్ ఏఓ అరుణ, టి.శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కలెక్టరేట్ నుంచి పవర్ గ్రిడ్‌కు విద్యుత్ !

కలెక్టరేట్‌లో ఉద్యోగుల వాహనాల పార్కింగ్ కోసం సోలార్ ప్యానళ్లతో కూడిన షెడ్ నిర్మించారు. ఈమేరకు ఉత్పత్తి అయ్యే 100 కిలోవాట్ల సోలార్ పవర్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను కలెక్టర్ గౌతమ్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. 100 కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌తో రోజుకు 400 నుండి 500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. ఇందులో కలెక్టరేట్ అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్ గ్రిడ్‌కు వెళ్తుందన్నారు. తద్వారా నెలకు రూ.80 వేల నుండి రూ.లక్ష మేర విద్యుత్ బిల్లులు ఆదా అవుతాయని తెలిపారు. ప్రస్తుతం 100 కిలో వాట్ల ప్లాంట్ పూర్తికాగా, మరో 100 కిలోవాట్ల పవర్ ప్లాంట్ పనులు వచ్చే నెల 15లోగా పూర్తవుతాయని వెల్లడించారు.



సోలార్ పవర్ స్విచ్ ఆన్ చేస్తున్న కలెక్టర్

వెంటాడుతున్న వరుణుడు

- జిల్లా అంతటా భారీ వర్షం
- బోనకల్‌లో అత్యధికంగా 61.3 మి.మీ.ల వర్షపాతం
- మరో మూడు రోజులు కురిసే అవకాశం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం కాస్త తెరిపినివ్వగా.. సోమవారం ఉదయం వరకు పరిస్థితి అలాగే ఉంది. కానీ ఆ తర్వాత జల్లులు మొదలై సాయంత్రం జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు చోట్ల పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. మరో మూడు రోజులు జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

మెట్ట పంటలకు ప్రతికూలం

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలకు ప్రతికూలంగా మారుతుండగా... మాగాణి పంటలకు అనుకూలంగా ఉన్నాయి. జూన్‌లో కాలానికి అగుగుణంగా వర్షాలు కురవలేదు. దీంతో అపరాల సాగు గణనీయంగా తగ్గగా, జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తి సాగు కూడా ముందుకు సాగలేదు. జిల్లాలో పత్తి సాగు అంచనా 2.23 లక్షల ఎకరాలు కాగా ఈనెల 20వ తేదీ వరకు కేవలం 1.35 లక్షల ఎకరాల్లో సాగైంది. పెసర పంట పరిస్థితి కూడా అలాగే ఉంది. అయితే, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మాగాణి పంటలకు అనుకూలమని చెబుతున్నారు. జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 2.80 లక్షల ఎకరాలుగా అంచనా వేయగా, జలాశయాల్లోకి వరద చేరటం, భూగర్భ జలాలు పెరగటం సాగుకు అనుకూలంగా మారింది.



వర్షంలోనే వెళ్తున్న వాహనదారులు

ఏన్కూరులో అత్యధికం

సోమవారం ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకు బోనకల్ మండలం రావినూతలలో అత్యధికంగా 61 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, రఘునాథపాలెంలో 60, ఏన్కూరులో 59.5, తల్లాడలో 55.8, తిరుమలాయపాలెం మండలం బచ్చోడులో 55.5, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం, ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురంలో 55.3, సింగరేణి మండలం గేటు కారేపల్లిలో 54, కల్లూరులో 50.3, కామేపల్లి లింగాలలో 49.3, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 49.3, రఘునాథపాలెం మంచుకొండలో 47.8, వైరాలో 46.5, ముదిగొండలో 46.3, తిరుమలాపాలెం మండలం కాకరవాయిలో 45.8, ఖమ్మం అర్బన్ మండలం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వద్ద 45.3, ప్రకాష్‌నగర్‌లో 45, తిరుమలాయపాలెంలో 44.5 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. అలాగే, రఘునాథపాలెం మండలం పంగిడిలో 44.3, కొణిజర్లలో 43, ముదిగొండ మండలం పమ్మిలో 38.8, మధిర మండలం సిరిపురంలో 38.3, నేలకొండపల్లిలో 36.5, ముదిగొండ మండలం బాణాపురంలో 29.8 మి.మీ.ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ ప్రకటించింది.

క్లుప్తంగా

అనిల్.. ఏమిటి?

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో సమావేశాలు ముగించుకుని బయటకు వస్తున్న కలెక్టర్ గౌతమ్‌ను దూరంగా నిల్చున్న ఓ విద్యార్థి సార్.. సార్ అని పిలిచాడు. ఆయన్ను చూడగానే కలెక్టర్ 'అనిల్.. ఏమిటి చెప్పు!' అనడంతో అంతా ఆశ్చర్యపోయారు. హైదరాబాద్‌లోని ఓయూలో హాస్టల్ సీటు ఇప్పించాలని కోరగా లెటర్ ఇవ్వు.. పరిశీలిద్దామని కలెక్టర్ బదులిచ్చారు. అనంతరం విద్యార్థి బొల్లం అనిల్‌ను పలకరించగా తనది మహబూబాబాద్ జిల్లా అని, అక్కడ కలెక్టర్‌గా ఉన్నప్పటి నుంచి గౌతమ్ అన్నీ తానై చదివిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా... హైదరాబాద్‌లోని యూనివర్సిటీ క్యాంపస్‌లో హాస్టల్‌లో సీటు ఇప్పించాలని కోరేందుకు వచ్చినట్లు తెలిపారు.

అమిత్‌షా సభ వాయిదా

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 29న ఖమ్మంలో జరగనున్న సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరుకావాల్సి ఉండగా, వర్షాల కారణంగా సభను వాయిదా వేసినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ సభ ఎప్పుడు జరిగేది త్వలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. గతంలోనూ ఓసారి సభకు ఏర్పాటుచేసినా వాయిదా పడిన విషయం విదితమే.

రేపు జాబ్‌మేళా

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ విద్యాచందన తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత కలిగి, ఏ మండలంలోనైనా పని చేసేందుకు ఆసక్తి అభ్యర్థులు అన్ని పత్రాలతో బుధవారం ఉదయం 10.30 గంటలకు టీటీడీసీలో మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 89776 31851, 79936 25332 నంబర్లలో సంప్రదించాలని డీఆర్‌డీఏ వెల్లడించారు.

పాలేరులో బీఆర్‌ఎస్ పొత్తుతో సీపీఎం పోటీ

తిరుమలాయపాలెం: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పొత్తుతో సీపీఎం పాలేరు నుండి బరిలో నిలుస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ తెలిపారు. మండలంలోని పిండిప్రోలులో సోమవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదరనున్నందున పాలేరులో సీపీఎం అభ్యర్థి బరిలో నిలుస్తారని, కార్యకర్తలు ఇప్పటి నుండే ప్రచారం మొదలుపెట్టాలని సూచించారు. నాయకులు శ్రీను, ఆర్.వెంకట్రామిరెడ్డి, వెంకట్రావు, పప్పుల ప్రసాద్, ఉపేందర్‌రెడ్డి, సైదులు, పుష్పవతి, వీరస్వామి, నాగటి సురేష్, పాపారావు, నిర్మల్‌రావు, రవి పాల్గొన్నారు.

ఇల్లెందు కాంగ్రెస్ టికెట్‌పై అసత్య ప్రచారం

కామేపల్లి(కారేపల్లి): ఇల్లెందు కాంగ్రెస్ టికెట్ విషయమై కొందరు సోషల్ మీడియాలో వారికి అనుకూలంగా ప్రచారం చేస్తూ కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నారని కామేపల్లి జెడ్పీటీసీ బాణోతు వెంకటప్రవీణ్‌కుమార్ నాయక్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను కలిసి వినతిపత్రం అందజేయగా, ఆయన స్పందిస్తూ సోషల్ మీడియాలో వస్తున్న జాబితాను నమ్మొద్దని చెప్పారని వెల్లడించారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఎర్రుపాలెం: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలను సందర్శించిన పీఆర్‌టీయూ నాయకులు ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, పదోన్నతులు, బదిలీలకు వెంటనే కార్యాచరణ రూపొందించాలన్నారు. సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపల్లి సంగిరెడ్డి, పాటి బాలకృష్ణతో పాటు వెంకటేశ్వరరావు, బ్రహ్మారెడ్డి, నాగరాజు, శ్రీను, లింగయ్య, ఫిలిప్, జీవరత్నం, చిన్నప్ప, అప్పలరాజు, వీరయ్యచౌదరి, బాబురావు, నాగమల్లేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వేళల్లో మార్పు సరికాదు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల పనివేళల్లో మార్పులు చేయటం సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలను ఉదయం 9-30నుంచి సాయంత్రం 4-15గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు 9-30నుంచి సాయంత్రం 4-45గంటల వరకు నిర్వహించాలని ఉత్తర్వులిచ్చారని తెలిపారు. అయితే, గ్రామాల్లో తల్లిదండ్రులు ఉదయం 7గంటలకే పనులకు వెళ్తూ పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నందున పనివేళల మార్పుపై ఉత్తర్వులు విరమించుకోవాలని కోరారు.

రైతుకు పాము కాటు

నేలకొండపల్లి: పొలం వద్దకు వెళ్లి వస్తుండగా చేనులో రైతును పాము కాటేసింది. మండలంలోని బోదులబండకు చెందిన బానోత్ రెడ్యా నాయక్ సోమవారం తన పొలం వద్దకు వెళ్లి వస్తుండగా పాము కాటు వేయడంతో ఆయన దాన్ని చంపేశాడు. ఆతర్వాత ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

రైతులారా.. పంటలు జాగ్రత్త

- అధిక వర్షాలతో చేలల్లో నిలిచిన నీరు
- సరైన సస్యరక్షణ చేపట్టకపోతే నష్టం



తల్లాడలోని పత్తి చేనులో పెరిగిన కలుపు మొక్కలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పైర్లలో పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. జిల్లా వ్యవసాయ శాఖ, వైరా కేవీకే శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. జూలైలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 177.1 మి.మీలు కాగా అంతకు మించి 198.9 మి.మీల వర్షపాతం నమోదైందని తెలిపారు. ఈ కారణంగా చేన్లలో నీరు నిలిచినందున ఇప్పటికే సాగు చేసిన పంటల్లో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు.

- **పత్తి:** అధిక వర్షాలకు పత్తిలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా తీసివేయాలి. వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించడానికి అంతరకృషి చేయాలి. దీని ద్వారా భూమిలో తేమ తగ్గి, మొక్కలు సాధారణ స్థాయికి చేరుకుంటాయి. వర్షాలను ఆసరా చేసుకొని ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు 5-7 సెం.మీల దూరంలో వేసుకోవాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంతర సేద్యం కాకపోతే 20-25 రోజుల దశలో క్విజలోఫాప్ ఇథైల్ 400 మి.లీ, పైరిథియోబాక్ సోడియం 250 మి.లీ కలిపి ఎకరాకు పిచికారీ చేయడం ద్వారా గడ్డి జాతి, వెడల్పాటి కలుపును నివారించవచ్చు. అధిక వర్షాలకు నల్ల నేలల్లో వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశాలు ఉన్నాయి. గమనించి కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బాండిజమ్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో తడపాలి. అధిక వర్షాలకు లేత పసుపు రంగుకు మారిన మొక్కలకు పోషకాలను ఆకుల ద్వారా 5-10 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క వయసును బట్టి పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసినట్లయితే మొక్కలు సాధారణ స్థాయికి చేరుతాయి.
- **మొక్కజొన్న:** మొక్కజొన్న అధిక తేమ ను తట్టుకోలేదు. చేనులో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించి, అవతర కృషి చేయడం ద్వారా మొక్కలు సాధారణ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఎకరాకు 25 కిలోల నత్రజని 10 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులను వేసుకోవాలి. మోకాలు ఎత్తు దశలో ఉన్న పైరులో కాండం తొలిచే పురుగు గమనించినట్లయితే కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 3 కిలోలు సుడిలో వేసుకోవాలి. కత్తెరపురుగు గమనించినట్లయితే నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క సుడిలో పిచికారీ చేయాలి.
- **అపరాలు:** పెసర, మినుము పైర్లలో నిలిచిన వర్షపు నీటిని సాధ్యమైనంత త్వరగా తొలగించాలి. అధిక వర్షాలకు నీరసించిన పెసర, మినుము పైర్లలో పొటాషియం నైట్రేట్ (13-0-45), 19-19-19 మొక్క వయసును బట్టి 5-10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అంతర్ కృషి సాధ్యం కాని పరిస్థితుల్లో పైరు 20 రోజుల దశలో వెడల్పాటి కలుపు నివారణకు ఇమాజితఫిర్ 30 మి.లీ, లేదా గడ్డి జాతి కలుపు నివారణకు క్విజాలోఫాప్ ఇథైల్ 400 మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి. పైర్లపై లద్దెపురుగు ఆశించే అవకాశాలు ఉన్నాయి. ఈ పురుగు నివారణకు మోనోక్రొటోపాస్ 1.6 మి.లీ లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా నోవాల్యురాన్ 1 మి.లీ లేదా థయోడికార్బ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చే యాలి. వర్షాలకు ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బాండిజమ్ 1 గ్రాము లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **కంది:** కందిలో అధికవర్షాలకు పైటోప్తారా ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు మాంకోజెబ్ 3 గ్రాములు లేదా మెటాలాక్సిల్ 2.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **మిరప:** అధిక వర్షాలకు మిరప నారుమడిలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. నారుకుళ్లు ఆశించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా రిడోమిల్ ఎం.జెడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు నారుమడిని తడపాలి.
- **వరి:** ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నీటి వనరుల ఆధారంగా ప్రస్తుతం నార్లు పోయని పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలు (120-125 రోజుల రకాలు) ఎంచుకొని నేరుగా వెదజల్లే పద్ధతిలో లేదా డ్రమ్‌సీడర్ ద్వారా విత్తుకున్నట్లయితే తక్కువ ఖర్చుతో వరిని సాగు చేసుకోవచ్చు.

దళితులు పారిశ్రామికవేత్తలుగా ఎదగొద్దా?

- పొంగులేటి వ్యాఖ్యలు సరికాదు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



మంత్రి కేటీఆర్ చిత్రాలను వీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

సత్తుపల్లి: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో హెలీకాప్టర్‌లో తిరిగినప్పుడు కనిపించిన అభివృద్ధి ఇప్పుడు కానరావడం లేదా అని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కూసంపూడి మహేష్ అధ్యక్షతన సోమవారం మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తుపల్లి ప్రజలకు సేవకుడిగా పని చేస్తున్న తనను దొరా అని పేర్కొనడం సరికాదన్నారు. దళితులు పారిశ్రామికంగా ఎదిగితే ఓర్వలేని పొంగులేటి.. ఆయన మాత్రమే వ్యాపారాలు చేయాలని అని ప్రశ్నించారు. అధికారాన్ని అనుభవించి దొరతనం చేసింది తాను కాదని.. ప్రజల కోసం మాత్రమే పనిచేస్తున్న తనపై తప్పుడు ఆరోపణలను సహించేది లేదని హెచ్చరించారు. అధికారంలోకి వస్తామని చెబుతున్న ఆయన తొలుత సత్తుపల్లిలోని కాంగ్రెస్ నాలుగు క్యాంప్ ఆఫీసులను ఒకటి చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అలాగే, మంత్రి కేటీఆర్ 47వ పుట్టినరోజు సందర్భంగా 47 రకాల హావభావాలతో సత్తుపల్లికి చెందిన సాయిశ్రీ గీసిన చిత్రాలతో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయగా ఎమ్మెల్యే తదితరులు పరిశీలించి అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కే.రఫీ, మల్లూరు అంకమరాజుతో పాటు చల్లగుండ్ల కృష్ణయ్య, అమరవరపు విజయనిర్మల, వీరపనేని రాధిక బాబీ, మట్టా ప్రసాద్, ఎస్.కే.ఛాంద్‌పాషా, రూత్ క్రిస్టియానా, మధు, వేములపల్లి మధు, అద్దంకి అనిల్, గోపాలరావు, వల్లభనేని పవన్ పాల్గొన్నారు.

పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



ధర్నాలో పాల్గొన్న సుధాకర్‌రెడ్డి, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలోని అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూంలు ఇళ్లు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు దరఖాస్తుదారులతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన సోమవారం పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నరేళ్లు గడిచినా పేదలకు ఇళ్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం ఇళ్ల కోసం ఇచ్చిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడగా నాయకులు నంబూరి రామలింగేశ్వరావు, గెంటెల విద్యాసాగర్, రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, మందా సరస్వతి, మిశ్రా, విజయరాజు, ప్రవీణ్, రాంప్రసాద్, అల్లిక అంజయ్య, నాగేశ్వరావు, వీరంరాజు, నెల్లూరి కోటేశ్వరావు, సంతోష్‌రెడ్డి, దొడ్డా అరుణ, కిరణ్, ఉపేందర్‌గౌడ్, శంకర్‌గౌడ్, సుదర్శన్, రవిరాథోడ్, వీరుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనరుడు గుర్రం జాషువా



సమావేశంలో మాట్లాడుతున్న బన్న అయిలయ్య

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు సాహిత్యంలో విశ్వ నరుడుగా గుర్రం జాషువా పేరుగాంచారని కేయూ తెలుగు శాఖాధ్యక్షుడు, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య పేర్కొన్నారు. ఖమ్మంలో సోమవారం జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యాన జాషువా వర్ధంతి సభ ఏర్పాటుచేశారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్వా శ్రీనివాసరావు, కార్యదర్శి పగడిపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈసమావేవంలో అయిలయ్య మాట్లాడుతూ జాషువా రచనల నిండా సగటు మనిషి ఎదుర్కొన్న కుల అసమానతలు, అవమానాలు ఉన్నాయని తెలిపారు. కవియుగ చక్రవర్తిగా, ఆయన జీవితమే సాహిత్యంగా అనేక కావ్యాల రూపంలో వెలువడ్డాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కవి, అధ్యాపకులు నయీంపాషా, ములక సురేష్, కోండ్రు బ్రహ్మం, గుంతేటి వీరభద్రం, మనోరమ, రవిమారుత్, తాళ్లూరి రాధ తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రి ఆలయ తోరణం పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న చైర్మన్

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలకలో నీలాద్రి ఆలయానికి వెళ్లే దారిలో స్వాగత తోరణం నిర్మించనున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యక్తిగతంగా అందజేసిన రూ.21 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు సోమవారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావుతో పాటు భుక్యా ప్రసాద్, రుద్రజారాణి, పాకల వెంకటరమణ, చెక్కిలాల లక్ష్మణరావు, ముక్కర భూపాల్‌రెడ్డి, చింతనిప్పు సత్యనారాయణ, వంగా నిరంజన్, యడ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఆగని బతుకు పోరాటం



జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. ఈ సమయంలో అత్యవసర పనులు ఉన్న వారే బయటకు వచ్చారు. కానీ స్టేడియం ప్రహరీ వెంట ఓ మహిళ మాత్రం బోడ కాకరకాయలు అమ్ముతూ కనిపించింది. ఇలాగే పలువురు చిరువ్యాపారులు వర్షంలోనే అమ్మకాలు సాగించగా.. కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయని వాపోయారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్

'మణిపూర్ మంటలు బీజేపీ పాపమే'



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌లో నాలుగు నెలలుగా జరుగుతున్న మారణ హోమానికి బీజేపీయే కారణమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆరోపించారు. సీపీఐ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన 'మణిపూర్‌లో మంటలు- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం' అంశంపై శింగు నరసింహారావు అధ్యక్షతన సోమవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో అత్యధిక శాతం ఉన్న మెయితీ తెగను ఆకట్టుకునేందుకు బీజేపీ యత్నాలతోనే ఈ మారణహోమం జరుగుతోందన్నారు. అల్లర్లను అణచలేనప్పుడు అధికారంలో కొనసాగే హక్కు లేదన్న మోడీ మాటలు ఇప్పుడు వర్తించవా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ అధికారులు తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని సత్తుపల్లి ఆర్టీసీ డిపో అద్దె బస్సు డ్రైవర్లు స్పష్టం చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి బస్సులను నిలిపివేసి ఆందోళనకు దిగారు. ఉదయం 11 గంటల వరకు బస్సులు నడవకపోడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ సత్తుపల్లి నుంచి ఖమ్మం వరకు పది స్టాపలకు తోడు ముప్పై వరకు రిక్వెస్ట్ స్టాప్‌లు ఉండటంతో సకాలంలో తిరిగి రాకపోతే అసిస్టెంట్ మేనేజర్ దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్ల నిర్ణీత సమయాన్ని పెంచాలని, లేదంటే రిక్వెస్ట్ స్టాప్‌లు తగ్గించాలని కోరుతూ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో కొలికపోగు సర్వేశ్వరరావు, వినయ్, సీహెచ్.రవి, తిరుపతిరావు, వినోద్, మురళి, పుల్లారావు, నరేష్, నాగరాజు, రహీం, భాష, శ్రీను, వెంకటేశ్వరరావు, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

రెండు చోట్ల 29 కేజీల గంజాయి స్వాధీనం

మహిళ సహా ముగ్గురి అరెస్ట్



ఖమ్మంరూరల్: స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు



వైరా: పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం వరంగల్, కోదాడ క్రాస్ రోడ్ల సమీపాన చేపట్టిన తనిఖీల్లో 17.660 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్, డీటీఎస్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఆర్.రాజిరెడ్డి తెలిపిన వివరాల మేరకు... మహారాష్ట్రకు చెందిన మహిళ కరిష్మా మొండాల్ వద్ద 10.235 కేజీలు, ఛతీస్‌గఢ్‌కు చెందిన సురేష్ బిశ్వాస్ వద్ద 7.660 కేజీల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశాలోని మల్కాన్‌గిరిలో గంజాయి కొనుగోలు చేసి వీరు బస్సులు మారుతూ ఖమ్మం చేరుకున్నారని చెప్పారు. అయితే, కొత్త బస్టాండ్‌కు వెళ్తే పట్టుబడతామనే భావనతో క్రాస్ రోడ్డు హైదరాబాద్ బస్సు కోసం వేచి ఉండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తనిఖీల్లో సీఐలు ఆర్.విజేందర్, కె.పోశెట్టి, ఎస్ఐలు ఎల్.అచ్చారావు, ఎం.సరిత, శంకర్, సిబ్బంది నాయక్, మధు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, మౌలంకార్, సురేందర్, గురుప్రసాద్, విశ్వనాథ్, రామారావు, బలరాం, హరీష్, లాలు పాల్గొన్నారు.

కొణిజర్లలో 12కేజీలు...

వైరా/కొణిజర్ల: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. వైరా సీఐ రమ్యారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల సమీపాన ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు అనుమానస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా 12 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన టునాబాగ్, యాసూ గరడగా వీరిని గుర్తించారు. తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు కిరిటీ, మమత, సిబ్బంది రవి, సీతారాం, శివనాగిరెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ మధు, నాయకులు

ఖమ్మం వైరారోడ్ : రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను జిల్లాలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈసందరర్భంగా ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ కేక్ కట్ చేయడంతో పాటు నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మధు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర మంత్రిగా తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆతర్వాత ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం నిర్వహించారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, నాయకులు బొమ్మల రామ్మూర్తి, ప్రసాద్, ముత్యాల వెంకటఅప్పారావు, అశ్విన్, చామకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీని ప్రారంభించండి



చైర్మన్ బాలరాజును సన్మానించి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించాలని యాదవ, కురమ ఐక్యవేదిక నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజుతోపాటు కలెక్టర్ గౌతమ్‌కు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. రెండో విడతగా జిల్లాలో 10,580 మంది రూ.43,750 చొప్పున చెల్లించి ఏడాది కావొస్తున్నా గొర్రెల పంపిణీ చేయడం లేదని తెలిపారు. ఐక్య వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బారీ మల్సూర్, మేకల నాగేశ్వరరావుతో పాటు కొప్పుల నర్సింహారావు, సారిక రాము, గజ్జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రశాంతినగర్ వద్ద సాగర్ కాల్వలో ఆదివారం ఓ యువతి మృతదేహం లభించగా ఆమె ఆచూకీ సోమవారం వెల్లడైంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రశాంతినగర్‌కు చెందిన గోకినపల్లి సమీర(18) తండ్రి పదేళ్ల క్రితం చనిపోవడంతో తల్లి సుభద్ర ఇద్దరు కుమార్తెలతో ఉంటూ కూలీ పనులకు వెళ్తోంది. పదో తరగతి పూర్తిచేసిన సమీర ఇంట్లో ఖాళీగా ఉండడంతో ఏదైనా పనికి వెళ్తే కుటుంబపోషణకు అండగా ఉంటుందని ఆదివారం మందలించిన తల్లి ఆతర్వాత బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ కాసేపటికే బయటకు వచ్చిన సమీర సాగర్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు పత్రికల్లో ఫొటోలు రావడంతో గుర్తించిన సుభద్ర పోలీసులను సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి రామాపురం రైల్వేగేట్ మూసివేత

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వేకాలనీ, బోనకల్ మండలం రామాపురం మధ్య ఉన్న రైల్వేగేట్(నంబర్ 114)ను ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు మూసి వేయనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మరమ్మతుల కారణంగా గేట్‌ను మూసివేస్తున్నామని పేర్కొన్నారు. ఈమేరకు వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లించాలని చింతకాని ఎస్సై, నాగులవంచ, రామాపురం సర్పంచ్‌లకు లేఖలు అందజేసినట్లు తెలిపారు.

కంటోన్మెంట్ల ఏరియాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తాం

సాక్షి, న్యూఢిల్లీ: కంటోన్మెంట్ల సివిల్ ఏరియాలను సంబంధిత మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ తెలిపారు. కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలు, దానికి ఆనుకుని ఉన్న రాష్ట్ర మున్సిపల్ ప్రాంతాలను నియంత్రించే పురపాలక చట్టాలలో ఏకరూపకతను తీసుకురావడానికి కొన్ని కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలను తొలగించాలన్నారు. దీంతో వాటిని పొరుగు మున్సిపాలిటీలతో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. ఈ నిర్ణయం ప్రకారం విధివిధానాలపై అభిప్రాయాలను తెలిపేందుకు ప్రతిపాదనలను రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు.

'మార్గదర్శి' డిపాజిట్‌దారుల సొమ్ము ఏమైంది?

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ డిపాజిట్‌దారుల సొమ్ముకు సంబంధించి ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏం జరిగిందో చూడాల్సి ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు శాఖల నుంచి ప్రధాన కార్యాలయానికి సొమ్ము తరలించడం సాధారణమేనని, అదే విధంగా ఈ కేసులోనూ జరిగిందని చెబుతున్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయానికి వెళ్లిన సొమ్ము ఏమైందోనన్న అంశంపై ఆలోచిస్తున్నామని పేర్కొంది. మార్గదర్శి కేసుల న్యాయపరిధిపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

రాక్షసులపై విజయం

- పేదల కోసం మూడేళ్లుగా పెత్తందారులతో మీ బిడ్డ పోరాటం: ఏపీ సీఎం జగన్
- పేదలకు స్థలాలివ్వకుండా, ఇళ్లను కట్టనివ్వకుండా ఎన్నో ఆటంకాలు
- ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి ఇవాళ 50,793 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం
- ఇకపై అమరావతి మనందరిది.. 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా

"పేద వర్గాలపై పెత్తందారుల దోపిడీలను సహించి భరించే కాలం పోయింది. ఈ మార్పు ఇక మీదట రాజకీయాలను శాసిస్తుంది. అలాంటి మార్పులకు మనసా వాచా కర్మణా సహకరించే ప్రభుత్వంగా, మీ అన్నగా.. నిరుపేద అక్కచెల్లెమ్మల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనతో 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా. ఇక నుంచి అమరావతి మనందరిది.
– సీఎం జగన్


గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదలకు మేలు జరిగే ప్రతి విషయంలో మనందరి ప్రభుత్వానికి, చంద్రబాబు పెత్తందారుల కూటమికి మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు మంచి జరగకూడదని రాక్షస బుద్ధితో అడ్డుకుంటున్న వారితో పెద్ద యుద్ధమే చేస్తున్నామన్నారు. సోమవారం సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు 50,793 ఇళ్ల నిర్మాణం, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం జగన్ మాట్లాడారు. తొలుత తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్దకు చేరుకున్న సీఎం జగన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటపాలెం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

ఆ తర్వాత కూడా బుద్ధి మారలేదు..

సీఆర్‌డీఏలో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబ సభ్యులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు కట్టించకుండా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు సృష్టించిన ఊరుపేరూ సంఘాలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ – 5 అడ్డు తగిలాయి. వీరంతా మొదట పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు వీల్లేదన్నారు. ఇందుకోసం ఏకంగా హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లిన దౌర్భాగ్యమైన పరిస్థితిని మన రాష్ట్రంలో మాత్రమే చూస్తున్నాం. ఈ పెద్దమనుషులు, పెత్తందార్లు, పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18 కేసులు, సుప్రీం కోర్టులో 5 కేసులు వేశారు. ఈ కేసులను పరిష్కరించేందుకు మీ తరపున మీ బిడ్డ మూడేళ్ల పాటు పోరాటం చేస్తూ వచ్చాడు. దేవుడు, ప్రజల చల్లని ఆశీస్సులు ఎప్పుడూ మంచికే ఉంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వమే కేసులు గెలిచింది. అనుమతులు తెచ్చుకుని మీకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఆ తర్వాత కూడా వారి బుద్ధి మారలేదు. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ఆపలేకపోయారు కాబట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి అడ్డు తగిలేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వారు ఎక్కని గడప దిగని గడప లేదు. కలవని కేంద్ర మంత్రీ, కేంద్ర సెక్రటరీలు కూడా లేరు. ఇంతమందిని కలిశాక చివరి ప్రయత్నంగా మళ్లీ హైకోర్టులో కేసు వేశారు. ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ ఎక్కడా ఉండదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి బీజేపీ మహాధర్నా వాయిదా

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని బీజేపీ వాయిదా వేసింది. రాబోయే మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలిగించకూడదన్న ఉద్దేశంతో మహాధర్నాను వాయిదా వేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాధర్నాను నిర్వహించబోయే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

శాంతిభద్రతలను కాపాడలేకపోతే ఎలా?

- మాట్లాడే హక్కును ఎవరూ అడ్డుకోలేరు
- పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం
- బీజేపీ ధర్నాకు గ్రీన్‌సిగ్నల్



సాక్షి, హైదరాబాద్: అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేయాలన్న డిమాండ్‌తో మంగళవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిర్వహించనున్న ధర్నాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీలకు ఆదేశాలు జారీ చేసింది. ధర్నాలో 500 మంది మాత్రమే పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఆ వివరాలను సోమవారం సాయంత్రం 6 గంటల కల్లా అధికారులకు సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతించకుంటే మరి ఎక్కడ చేయాలి?.. మాట్లాడటం అనేది ప్రజల ప్రాథమిక హక్కు, దానిని ప్రభుత్వం అడ్డుకోలేదని తేల్చిచెప్పింది. పోలీసులు శాంతిభద్రతలను కాపాడలేకపోతే ధర్నాకు హాజరయ్యే ప్రజలకు పాస్‌లు జారీ చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆదేశించింది. 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ధర్నాకు శాంతిభద్రతల పేరుతో పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.ప్రదీప్‌కుమార్ సోమవారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ధర్నాలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు. దాదాపు 1000 మంది హాజరయ్యే ఈ ధర్నాకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇళ్లు ఇవ్వడం లేదని, నిర్మాణంలోనూ అవకతవకలు జరుగుతున్నాయని.. అందుకే బాటసింగారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్లిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాగా, వెయ్యి మందితో ధర్నా నిర్వహిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని హోం శాఖ జీపీ రూపేందర్ చెప్పారు. ఇందిరాపార్కు వద్ద కొద్ది రోజుల క్రితం స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని.. అది ఇంకా ప్రారంభం కూడా కాలేదని, ధర్నాకు అనుమతి ఇస్తే బ్రిడ్జి దెబ్బతినే అవకాశం ఉందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ధర్నాకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'సోమేశ్ తీర్పు'నే వర్తింపజేయాలి

కేడర్ వివాదంపై హైకోర్టులో కేంద్రం వాదనలు • మా వాదనలు కూడా వినాలన్న పిటిషనర్లు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది జనవరి 10న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలనే డీజీపీ అంజనీకుమార్ సహా 12 మంది ఆలిండియా సర్వీస్ అధికారులకు వర్తింపజేయాలని కేంద్రం వాదనలు వినిపించింది. 13 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. అయితే సోమేశ్ కుమార్‌తో కేడర్‌కు సంబంధించిన అంశాల్లో పలు వ్యత్యాసాలు ఉన్నాయని, తమ వాదనలు కూడా వినాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా విడివిడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. సోమేశ్‌కుమార్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. రివ్యూ పిటిషన్‌లో తుది ఉత్తర్వులు వచ్చే వరకు 13 మంది పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ ఓ పరిశీలన నివేదికను కోర్టుకు అందజేశారు. దీని ప్రకారం అంజనీకుమార్, రొనాల్డ్ రాస్, జె.అనంత రాము, ఎస్ఎస్ రావత్, ఆమ్రపాలి కాటా, అభిలాషా బిస్త్ కేసులు సోమేశ్‌కుమార్ కేసు విశ్లేషణతో సరిపోతాయని, వారికి జనవరి తీర్పును వర్తింపజేయాలని డీఎస్‌జీ కోరారు. మిగతా వాటిపై విడిగా విచారణ చేపట్టవచ్చని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసుల పరిశీలనకు సమయం పడుతుందంటూ, విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది.

హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక విద్యార్థి ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా బొంరాహేమ్యా తండాలో ఘటన

కుల్కచర్ల: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక ఓ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. కుల్కచర్ల మండలం బొంరా హేమ్యాతండాకు చెందిన హీరమన్, శాంతిబాయి దంపతుల కుమారుడు వినోద్(15) స్థానిక పాఠశాలలో ఇటీవల ఏడో తరగతి పూర్తిచేశాడు. కొద్దిరోజుల క్రితం తల్లిదండ్రులు అతన్ని పటాన్‌చెరులోని గిరిజన ఆశ్రమపాఠశాలలో చేర్పించారు. అక్కడ ఉండటం ఇష్టంలేని బాలుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. సెలవులున్నాయని ఇటీవల ఇంటికి వచ్చిన అతన్ని తిరిగి హాస్టల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వినోద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గోదారికి పోలవరం అడ్డంకి

- పోలవరం అథారిటీకి స్పష్టం చేసిన తెలంగాణ
- ఆ ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తోంది
- అందుకే గతేడాది రాష్ట్రంలో ముంపు ప్రభావం
- ప్రాజెక్టు గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచాలని లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నాటి పరిస్థితులతో పోల్చితే ప్రాజెక్టు నిర్మించిన తర్వాత తెలంగాణ భూభాగం పరిధిలో గోదావరి నది స్వేచ్ఛా ప్రవాహాన్ని కోల్పోయిందని, పోలవరం అడ్డంకిగా మారిందని తెలంగాణ రాష్ట్రం మళ్లీ ఆందోళన వ్యక్తం చేసింది. దీని ప్రభావం భద్రాచలం వద్ద గోదావరిలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణ భూభాగంలో ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జల సంఘానికి మరో సారి తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఈ నెల 21న లేఖ రాశారు. పోలవరం 48 గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాది గోదావరికి వచ్చిన వరదలతో తెలంగాణలోని భద్రాచలం, పరిసర గ్రామాల పరిధిలోని 28వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తికావడమే దీనికి కారణమన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను నిర్ధారించేందుకు జాయింట్ సర్వేను నిర్వహించాలని మరోసారి పీపీఏను కోరారు.

జిల్లా వార్తలు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ

ఇల్లెందు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా ఎన్నికలకు ముందే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వచ్చే నెల రెండో వారం హైదరాబాద్‌లో జరగనున్న విశ్వరూప సభ విజయవంతానికి సోమవారం ఇల్లెందులో సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ గత పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతోనే వర్గీకరణ విషయంలో నష్టం జరిగిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే అన్నిరకాలుగా లాభం ఉంటుందని, 20 వేల ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. కాగా, అధికారంలోకి వచ్చేందుకు మాదిగలను కేసీఆర్ అణగదొక్కగా, పార్లమెంట్‌లో మాట్లాడని రేవంత్‌రెడ్డి తెలంగాణలో మాత్రం వర్గీకరణ కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, వంగూరి ఆనందరావు, కె.వెంకటేశ్వరరావు, మెంతెన వసంతరావు, జినక ఇస్తారి, సోమయ్య, కాంపాటి పృథ్వీ, నాగమణి, సుభద్ర, పి.ప్రభాకర్, ఎం.ప్రభాకర్, చింతల మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎన్ఎండీసీ క్రికెట్ టోర్నీలో సింగరేణి జైత్రయాత్ర


సింగరేణి క్రికెట్ జట్టు

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లో జరుగుతున్న ఎన్ఎండీసీ క్రికెట్ టోర్నీలో సింగరేణి జట్టు సత్తా చాటుతోంది. ఎనిమిది ప్రభుత్వరంగ సంస్థల తరఫున జట్లుపాల్గొంటుండగా, ఈనెల 16, 23వ తేదీల్లో జరిగిన మ్యాచ్‌ల్లో సింగరేణి జట్టు గెలుపొందింది. దీంతో గ్రూప్–ఏలో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఇంకో లీగ్ మ్యాచ్ ఉండగానే సెమీస్‌లోకి ప్రవేశించింది. కాగా, సింగరేణి జట్టు విజయాల్లో కెప్టెన్ శశికాంత్‌తో పాటు క్రీడాకారులు శశ్వంత్, జగదీష్, హరికిషన్, చిరంజీవి తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

జీవన ఎరువు.. కరువు !

- తెగుళ్లను సమగ్రంగా నివారించే ఎరువుల కొరత
- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తయారీ
- డిమాండ్‌కు అనుగుణంగా లేని ఉత్పత్తి
- ప్రయోగశాల ఎదుట నోస్టాక్ బోర్డులు.. ప్రదక్షిణలు చేస్తున్న రైతులు


ఎరువు వాడకంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: పంటల్లో తెగుళ్లను సమగ్రంగా నివారించగలిగే జీవన ఎరువులకు కొరత ఏర్పడింది. వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో ఈ ఎరువులకు డిమాండ్ పెరిగింది. సాగుకు ఎంతో ప్రయోజనకరమైన జీవన ఎరువులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తయారు చేస్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేసే పంటల దృష్ట్యా ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో వ్యవసాయ శాఖ 2011లో ఏర్పాటు చేసిన జీవ నియంత్రణ ప్రయోగశాలలో ఈ ఎరువులను తయారు చేస్తున్నారు. ప్రస్తుత వానాకాలంలో పంటల సాగు వేగవంతం కావటంతో రైతులు జీవ ఎరువుల కొనుగోళ్లకు ప్రయోగశాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల తయారీ లేకపోవడంతో నిర్వాహకులు నో స్టాక్ బోర్డు పెట్టారు. దీంతో రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

రెండు రకాలుగా తయారీ..

ఖమ్మంలోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్ ఎరువులను తయారు చేస్తున్నారు. ప్రతి ఏటా రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ 10 టన్నుల తయారీకి అనుమతి ఇస్తూ, ఎరువుల తయారీకి అవసరమైన అన్ని రకాల కెమికల్స్ అందజేస్తోంది. ప్రయోగశాల నిర్వాహకులు విడతల వారీగా ఈ రెండు రకాల ఎరువులను తయారు చేస్తారు. సైకిల్ విధానంలో ఒక ఎరువు తయారీకి 15 రోజుల వ్యవధి పడుతుంది. ఒక్కో విడతలో ఒక్కో ఎరువును 250 కిలోల చొప్పున మొత్తం 500 కిలోలు తయారు చేస్తున్నారు.

డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేదు..

ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్ ఎరువుల వినియోగానికి తగిన విధంగా ఉత్పత్తి లేకపోవడంతో కొరత సమస్య తలెత్తుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని రకాల పంటలకు రైతులు వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా మిర్చి సాగులో తెగుళ్లను ఈ ఎరువులు నివారిస్తుండడంతో రైతులు వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక్కో జీవన ఎరువును ఎకరాకు 4 కిలోల చొప్పున వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 11 లక్షల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో మిర్చి దాదాపు 1.30 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. జీవ నియంత్రణ ప్రయోగశాల తయారు చేసి విక్రయించే ఎరువులు 5 వేల ఎకరాలకు మించి సరిపోదు. దీంతో సమస్య ఎదురవుతోంది. ఎరువుల దుకాణాల్లో వివిధ కంపెనీలకు చెందిన ఈ జీవన ఎరువుల లభ్యత ఉన్నప్పటికీ రైతులు వ్యవసాయ శాఖ తయారు చేసే ఎరువులపైనే నమ్మకం పెట్టుకుని కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యవసాయ శాఖ ప్రయోగశాలలో ట్రైకోడెర్మా విరిడీ కిలో ప్యాకెట్ ధర రూ.100 కాగా, సూడోమోనాస్ కిలో ప్యాకెట్ ధర రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ ప్యాకెట్ల వినియోగ కాలం 6 నెలలు మాత్రమే ఉంటుంది.


ప్రయోగశాలలో జీవన ఎరువు తయారుచేస్తున్న ఉద్యోగులు

ప్రయోజనాలతోనే డిమాండ్..

జీవన ఎరువులతో ప్రయోజనాలు పుష్కలంగా ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. విత్తన శుద్ధి మొదలు, భూమిలో పోషకాలను సమతుల్యం చేయటం, తెగుళ్లను సమగ్రంగా నియంత్రించటం కోసం ఈ ఎరువులు వినియోగిస్తారు. ట్రైకోడెర్మా విరిడీని విత్తన శుద్ధి, మిరపలో నారు, వేరుకుళ్లు నివారణకు, కంది, పత్తిలో కూడా వేరుకుళ్లుకు, అల్లం, పసుపుల్లో దుంపకుళ్లకు, వేరుశనగలో కాయకుళ్లు, వేరుకుళ్లు నియంత్రణకు వినియోగిస్తారు. నేల ద్వారా వ్యాపించే శిలీంద్రాల నిర్మూలనకు వాడుతారు. సూడోమోనాస్‌ను ఒక బ్యాక్టీరియాతో తయారు చేస్తారు. ఈ ఎరువును వరి నాటే సమయంలో కాండంకుళ్లు నివారణకు వినియోగిస్తారు. వరిలో ఆకుఎండు తెగులు, పాముపొడ వంటి తెగుళ్లను సమగ్రంగా నివారిస్తుంది. మిరపలో తెగుళ్లను కూడా సేంద్రియ ఎరువులతో కలిపి వినియోగిస్తే వివిధ రకాల తెగుళ్లు నియంత్రించవచ్చు.

ఎరువులు లభించటం లేదు



ఖమ్మంలోని గట్టయ్య సెంటర్‌లో జీవ నియంత్రణ ప్రయోగశాలలో తయారు చేస్తున్న ఎరువులు లభించటం లేదు. ఎప్పుడు వెళ్లినా నో స్టాక్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. అన్ని రకాల పంటల సాగులో జీవన ఎరువులను వినియోగిస్తాం.

– దేవరం వెంకటరెడ్డి, ఏలువారిగూడెం, తిరుమలాయపాలెం మండలం

వాడమంటారు.. ఇవ్వరు



జీవ నియంత్రణ ఎరువులు ఎంతో మేలని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో కొన్ని సంవత్సరాలుగా వాడుతున్నాం. ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కొరత ఏర్పడింది. రైతులకు సరిపడా ఎరువులు ఉత్పత్తి చేసి అందుబాటులో ఉంచాలి.

– కాంపాటి శ్రీనివాసరావు, ఎదుళ్ల చెరువు, తిరుమలాయపాలెం మండలం

సామర్థ్యం మేరకు తయారీ..



జీవన ఎరువులకు ప్రాధాన్యత పెరిగింది. రైతుల డిమాండ్‌కు తగినంతగా ప్రయోగశాలలో తయారు చేయలేం. సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేస్తున్నాం. రైతులు జీవన ఎరువుల కోసం ప్రయోగశాలకు వచ్చి వెళుతున్నారు. వివిధ పంటల్లో ఈ ఎరువుల వినియోగం పెరిగింది.

– వాణిశ్రీ, ఏడీఏ, జీవనియంత్రణ ప్రయోగశాల, ఖమ్మం

వారసులకు కారుణ్య నియామక పత్రాలు


నియామక పత్రాలు అందుకున్న వారితో జీఎం, తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వర్తించి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన వారి సోమవారం కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు 516 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగులు రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అధికారులు జీ.వీ.కోటిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, సుధాకర్, మురళి, ఎం.వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్‌తో పాటు ఎం.డీ.రజాక్ పాల్గొన్నారు.

సమావేశం ఏర్పాట్లు పరిశీలన

కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఈనెల 25న సింగరేణి ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రత సమావేశం జరగనుంది. ఈమేరకు ఏర్పాట్లను సోమవారం జీఎం శాలేం రాజు పరిశీలించి సూచనలు చేశారు. అధికారులు, ఉద్యోగులు కోటిరెడ్డి, సీహెచ్.రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, పాలడుగు శ్రీనివాస్, రమణారెడ్డి, అనిల్, దేవదాసు, తావ్ర్యానాయక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్


దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గిరిజనులకు అవగాహన కల్పించడంతో పాటు వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనిట్ అధికారులకు అందచేశారు. అనంతరం అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ గోదావరి వరదలు, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఈమేరకు గిరిజనులు, ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. అలాగే, అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(జనరల్), ఇన్‌చార్జ్ డీడీ, గురుకులం ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, అధికారులు తానాజీ, విజయ్‌కుమార్, భీమ్, భాస్కర్, సురేష్‌బాబు, అశోక్‌కుమార్, మునీర్ పాషా, రమణయ్య, ఆదినారాయణ, శ్రీనివాస్, నర్సింహారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనేతర పేదలకూ పోడు పత్రాలు ఇవ్వాలి

ప్రజాపంథా రాష్ట్ర నాయకులు గుమ్మడి, రాయల


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులతో పాటు గిరినేతరులకు కూడా గిరిజన చట్టాలకు లోబడి హక్కు పత్రాలు ఇవ్వాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గుండాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 11లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉండగా, నాలుగున్నర లక్షల ఎకరాలకే ఇచ్చిన ప్రభుత్వం చేతులు దులుపుకుతోందని ఆరోపించారు. ఈమేరకు పూర్వ కాలం నుంచి పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులతో పాటు గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇచ్చి సాగుదారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాగా, గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ ఇటీవల కొందరు తనను గిరిజన చట్టాలకు వ్యతిరేకిగా చేస్తున్న ప్రచారంలో ప్రచారం వాస్తవం లేదని చెప్పారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులకు పట్టాలు ఇవ్వాలని తాను కోరితే చట్టాలనే రద్దు చేయాలని అన్నట్లు పేర్కొనడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయిని రాజు, కొమరం శాంతయ్య, ఈసం శంకర్, బుర్ర వెంకన్న, వాంకుడోత్ అజయ్, కుమార్, తెల్లం రాజు, ఈసం కృష్ణ, జగన్, రామన్న, పాల్గొన్నారు.